విలీన గ్రామంలో జగనన్న సురక్ష


లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న చైర్మన్ షేక్ రఫానీ, కమిషనర్ గోవిందరావు, వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు

- 661 మందికి ధ్రువపత్రాల పంపిణీ
- హాజరైన మున్సిపల్ యంత్రాంగం

నాదెండ్ల: మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలు ఉన్నత న్యాయస్థానం పరిధిలో ఉన్నందున కొంత అభివృద్ధి ఆగిన మాట వాస్తవమేనని చిలకలూరిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ రఫానీ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామంలోని 4 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 3500 గృహాలకు గాను సుమారు 2700 గృహాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గడిచిన కొద్దిరోజులుగా సర్వే నిర్వహించారు. 629 ధ్రువపత్రాలు లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీరాజ్ శాఖలో గణపవరం ఉన్నందున ఆర్థిక సంఘం నిధులు రాక మున్సిపల్ నిధులు ఖర్చు చేసేందుకు కోర్టు పరిధిలో ఉన్నందున సమస్యలు ఉన్నాయన్నారు. త్వరలో ఈ సమస్యను పరిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ గోవిందరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం చిలకలూరిపేట పట్టణ పరిధిలో 32 వార్డులకు గాను ఈ నెల 1 నుంచి 28వ తేదీతో పూర్తయ్యాయన్నారు. విలీన గ్రామమైన గణపవరంలో నేటితో జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తయిందన్నారు. 5 వేలకు పైగా ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు తెలిపారు. లబ్ధిదారులు ఆగస్టు నుంచి వివిధ సంక్షేమ పథకాలకు అర్హులౌతారన్నారు. ప్రస్తుతం గణపవరం పరిధిలో రూ.4.5 కోట్ల ఆదాయం ఉందని, పంచాయతీ కార్యదర్శులు తమకు రికార్డులు అప్పగించనందున తాము గ్రామ అభివృద్ధిలో జోక్యం చేసుకోలేకపోయామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించటంతో వారికెంతో మేలు జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, తహసీల్దార్ ఏవీ రమణ, నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు కురుకుంట్ల వెంకటరెడ్డి, నియోజకవర్గ జగనన్న సురక్ష కన్వీనర్ విడదల రవిశ్రీనివాస్, నాయకులు కాటా వెంకటేశ్వర్లు, తోట బ్రహ్మస్వాములు, అనిశెట్టి కోటేశ్వరరావు, డీటీ అనురాధ, ఆర్ఐ షేక్ రమీజా, పంచాయతీ కార్యదర్శులు శేఖర్, కవిత, జ్యోతిర్మయి. వీఆర్వోలు సాంబశివరావు, వీరయ్య, వెంకటరమణ, అంకమ్మ పాల్గొన్నారు.

చేయూత దక్కింది!



మాది పేద కుటుంబం. మాకు ఇరువురు సంతానం. జగనన్న చేయూత పథకం ద్వారా గతంలో పలుదఫాలు ఆర్థికసాయం పొందా. ఈ పథకం రెన్యువల్ కోసం అధికారులు ధ్రువపత్రాలు అడిగారు. ఇటీవల వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమ ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకుని జగనన్న సురక్ష కార్యక్రమంలో పేరుపెట్టి పిలిచి ఉచితంగా ధ్రువపత్రాలు అందించారు.

–కుసులూరి శాంతకుమారి, గణపవరం

గుర్తింపు లభించింది



మాది వ్యవసాయ కుటుంబం. నాకు 1.25 ఎకరాల పొలం ఉంది. దీంతోపాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి ఇతర పంటలు సాగు చేస్తుంటా. గతంలో కౌలు రైతు గుర్తింపు కార్డు ఇచ్చారు. రెన్యువల్ కోసం దరఖాస్తు చేయగా గుర్తింపు కార్డు ఇచ్చారు. దీంతో ప్రభుత్వం నుంచి అందే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధరలు లభిస్తాయి.

–మలిశెట్టి రమేష్, గణపవరం

ఆధార్ అప్‌డేట్ చేశారు



నేను దివ్యాంగుడను. ఎక్కడికి వెళ్లాలన్నా మూడు చక్రాల బండిపై తిరగాలి. గతంలో పలు మార్లు దివ్యాంగ పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగ పింఛను అందింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆధార్ కార్డులో ఫోన్‌లింక్ అప్‌డేట్ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లే భుజాలపై మోసుకుని వెళ్లి ఆధార్ లింక్ చేయించారు.

–షేక్ బాజి, దివ్యాంగుడు, గణపవరం

సాగర్ జలాలు తరలివచ్చె!



చిలకలూరిపేటకు మంచినీరు సరఫరా చేసే రెండు చెరువులకు సాగర్ జలాలు చేరుకుంటున్నాయి. తాగునీటి రెండు చెరువుల్లో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకోవడం, ప్రతి ఏడాది జూన్‌లో విడుదల చేసే సాగర్ జలాలు ఈ ఏడాది విడుదల కాకపోవడంతో నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఈఎన్‌సీలతో మాట్లాడి సాగర్ జలాల విడుదలకు ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఎస్‌పీ అధికారులు 4.2 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఈ నెల 25 నుంచి మంచినీటి చెరువులకు సాగర్ జలాలు చేరుకోవడం ప్రారంభమయ్యాయి. కొద్ది రోజులు మాత్రమే సాగర్ జలాల లభ్యత ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని చెరువులకు పెడుతున్నారు. శనివారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ చెరువులను పరిశీలించారు. ఎన్ఎస్‌పీ అధికారులకు ఫోన్ చేసి కనీసం మరో 15 నుంచి 20 రోజుల పాటు కెనాల్ ద్వారా నీటిని అందుబాటులో ఉంచాలని కోరారు. అప్పుడే కొంత మేరకైనా చెరువులను నింపుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు.

–చిలకలూరిపేట

పేటలో బోధన నైపుణ్య శిక్షణ తరగతులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఆగస్టు 7వతేది నుంచి 11వతేదీ వరకు ఐదు రోజుల పాటు బోధనా నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. ఈమేరకు శిక్షణ తరగతుల బ్రోచర్‌ను శనివారం సాయంత్రం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త ఆవిష్కరించారు. కళాశాల విద్యా కమిషనరేట్ సౌజన్యంతో జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా బోధనా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు శిక్షణా తరగతులు దోహదపడతాయని ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య తెలిపారు.

తరగతులకు రిసోర్స్ పర్సన్స్‌గా న్యూఢిల్లీ ఎన్ఐఈపీఏ ప్రొఫెసర్లతో పాటు విద్యారంగంలో నిష్టాతులైన ప్రొఫెసర్లు హాజరవుతారన్నారు. ఐదు రోజుల పాటు 600మంది అధ్యాపకులు శిక్షణా తరగతులలో పాల్గొంటారని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్ వివరాలకు 94906 45147, 9985048923 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని కలసిన నాగార్జున యాదవ్


ఎమ్మెల్యేను అభినందిస్తున్న నాగార్జున

నరసరావుపేట: పార్టీని నమ్ముకొని పనిచేసిన వారికి న్యాయం జరుగుతుందనేదానికి నిదర్శనమే యనమల నాగార్జున యాదవ్‌కు ఆంధ్రప్రదేశ్ విద్య-సంక్షేమ, మౌలిక వసతుల కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడిసి) చైర్మన్ పదవి లభించటమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేకమందికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి న్యాయం చేశారన్నారు. పదవి లభించిన నాగార్జునా యాదవ్ శనివారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. యాదవ్‌కు ఎమ్మెల్యే అభినందనలు తెలియచేసి దుశ్శాలువతో సన్మానించారు. గత కొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నమ్మకంతో పనిచేస్తున్నందుకు ముఖ్యమంత్రి తగిన పదవి అందజేశారన్నారు. సరైన వ్యక్తి సరైన పదవి లభించినట్లుగా తాను భావిస్తున్నామన్నారు. నాగార్జునను షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, జెడ్పీటీసీ చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన సుబ్బాయమ్మ శ్రీనివాసరావు, వైస్-ఎంపీపీ వెంకటప్పరెడ్డి, నాయకులు మూరే రవీంద్ర, కనకపుల్లారెడ్డి, బీరం భాస్కర్ రెడ్డి, హనిమిరెడ్డి, సాని కొమ్ము కోటిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి, పలువురు నాయకులు అభినందించారు.

పాము కాటుకు మహిళ మృతి



శావల్యాపురం: పొలంలో గడ్డి కోస్తూ పాము కాటుకు గురై (విష సర్పం) ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని కనమర్లపూడి గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై తుళ్ళూరి తిరుపతిరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వినుకొండ జ్యోతి (45) పొలంలో గడ్డి కోస్తుండగా పాముకాటుకు గురైనట్లు గమనించింది. ఇంటికి వచ్చి తన భర్త రాంబాబుకు విషయం చెప్పగా వెంటనే వినుకొండ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్ష చేసి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు. మృతురాలు భర్త రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ తన్నీరు. భారతి, మండల వైఎస్సార్ సీపీ కోఆర్డినేటరు బోడెపూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావు, ఎంపీటీసీ సభ్యురాలు మరియమ్మ గ్రామ పెద్దలు తదితరులు మృతదేహాన్ని పరామర్శించి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా బోడెపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు సారథ్యంలో కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక చేయూత అందిస్తామన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు


రొంపిచర్లలో అలంకరించిన పీర్లు


వినుకొండలో పీర్ల చావడిలో అలంకరించిన పీర్లు


శావల్యాపురంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వినుకొండ(నూజెండ్ల): మతసామరస్యానికి, త్యాగానికీ ప్రతీక అయిన మొహర్రం పండుగను వినుకొండ పట్టణం, రూరల్ మండలంలోని పలుగ్రామాల్లో ముస్లిం సోదరులు శనివారం ఘనంగా నిర్వహించారు. మొహర్రం సందర్భంగా పీర్ల చావడిలను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. చావడిలోని పీర్లకు నూతన వస్త్రాలు తొడిగి ప్రత్యేక అలంకరణ చేశారు. అదేవిధంగా నూజెండ్ల మండలంలోని తెల్లబాడు, చెరుకుంపాలెం, కంభంపాడు, అల్లీబాయిపాలెం గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: త్యాగాలకు ప్రతీకగా మొహర్రం నిలిచింది. మత సామరస్యానికి పీర్ల పండుగ నిదర్శమని నూర్ బాష సంఘం మత పెద్దలు అన్నారు. శనివారం మండల కేంద్రమైన శావల్యాపురంలో మొహర్రం వేడుకలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం

నరసరావుపేట: ముస్లిం సోదరులు పాటించే మొహర్రం త్యాగానికి, ధర్మ పరిరక్షణకు ప్రతీక అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం పండగను నిర్వహించుకుంటున్న ముస్లిం మైనార్టీ సోదరులకు సందేశమిచ్చారు. ఈ పవిత్ర సంతాప దినాలు రాష్ట్రంలో మత సమైక్యతకు ప్రతిబింబంలా నిలుస్తాయని పేర్కొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో ముస్లింలు పదిరోజులుగా నిర్వహిస్తున్న మొహరం పండుగ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. మండలంలోని విప్పర్ల, రొంపిచర్ల, సంతగుడిపాడు, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట, అన్నవరం, మునమాక గ్రామాల్లోని పీర్ల చావిడిలలో ఈ వేడుకలు ముగిశాయి. అత్యంత భక్తి శ్రద్ధలతో పదిరోజుల పాటు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించారు. చివరిరోజున ఈ వేడుకల్లో ముస్లింలతో పాటు హిందూవులు కూడా పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలో మొహరం పర్వదినాన్ని శనివారం ముస్లీంలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాలలోని పీర్ల చావిడలనుంచి పీర్లు ఉరేగింపుగా శివునిబొమ్మ సెంటర్‌లోని అగ్ని గుండం వద్దకు చేరుకొన్నారు. పీర్లును అగ్ని గుండం దాటించి షహదత్ నిర్వహించేందుకు పాతూరులోని బావి వద్దకు తీసుకవెళ్లారు. పీర్లు వస్తున్న దారి పొడవునా కుల మతాలకు అతీతంగా స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. తమ చిన్నారులను పీర్లుకు తాకించి ఆశీస్సులు అందుకున్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజీలేని పోరాటం చేసి తమ ప్రాణాలను బలిచ్చిన వీరులను స్మరించుకుంటూ మొహర్రం పండుగను మండలంలోని పలు గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అప్పాపురం, చందవరం, సాతులూరు, కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం, నాదెండ్ల, తూబాడు, గొరిజవోలు, తదితర గ్రామాల్లో గత పదిరోజులుగా మొహర్రం వేడుకలు జరిపారు. పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. నిప్పుల గుండం ఏర్పాటు చేసి పీర్లతో నడిచారు. కులమతాలకు అతీతంగా వేడుకల్లో ప్రజలు పాల్గొన్నారు. అప్పాపురంలో ముజావర్లు పఠాన్ జాన్‌బీ, ఉస్మాన్‌ఖాన్, మొహమ్మద్ ఖాన్, చందవరంలో ముజావర్లు నిర్వహించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపు

నరసరావుపేట: బరంపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఏర్పాటుచేసిన కౌంటర్‌ను వినియోగదారులు ఉపయోగించుకోవాలని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు శనివారం వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: కుటుంబ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. బరంపేట ఇస్కాన్ టెంపుల్ సమీపంలో నివాసం ఉంటున్న తమ్మలూరి వెంకట సాంబశివరావు (35) శుక్రవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవపడి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు సాంబశివరావుని కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రహంతుల్లా శనివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మృతుడి తండ్రి సీతారామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్పంచ్‌కు విద్యుదాఘాతం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామ సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావుకు విద్యుదాఘాతమై కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. శనివారం మరమ్మతులు నిర్వహిస్తుండగా ఈ సంఘటన జరిగింది. తీవ్రగాయాలైన నాగేశ్వరరావును వైద్యసేవల నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు బంధువులు వెల్లడించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అసోసియేషన్ భవనంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి వైద్యశాల సిబ్బంది శిబిరంలో పాల్గొని పింఛన్‌దారులకు శుక్లాలు, నీటికాసులు తదితర కంటి సమస్యల పరీక్షలు నిర్వహించి ఐ డ్రాప్స్ మందులు అందచేశారు. దాదాపు 60 మంది అసోసియేషన్ సభ్యులకు పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి ఆదెయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ, రాఘవయ్య, మాధవరెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు కథల పోటీలు



నరసరావుపేట ఈస్ట్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం బరంపేటలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో చిన్నారులకు కథ చెబుతారా! ఊ.. కొడతాం కథల పోటీలు నిర్వహించారు. చిన్నారులలో సృజనాత్మకత, ఊహాశక్తి, విలువలు పెంపొందించేందుకు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరుజిల్లా సమన్వయకర్త ఇ.అమ్మడు తెలిపారు. పోటీలో జూనియర్స్ విభాగంలో సాయిమణికంఠ, అల్తాఫ్, విశాల్, సీనియర్ విభాగంలో ఆర్.చక్రి, డి.హరిణి, వి.చరణ్ బహుమతులు సాధించారు. న్యాయనిర్ణేతలుగా రత్నాకరం రాము, ఆర్.సురేష్, ఇందిరా శాస్త్రీ, వీఎల్ఎస్ మూర్తి వ్యవహరించారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై సిగ్నల్‌బోర్డును తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై గణపవరం పరిధిలోని టీబీ ఆసుపత్రి వద్ద శుక్రవారం అర్థరాత్రి చోటు చేసుకుంది. హైవే పెట్రోలింగ్ పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన యోహాను తన ట్రాలీ ఆటోలో చిలకలూరిపేటలో సరుకు అన్‌లోడ్ చేసి తిరిగి గణపవరం వెళ్తున్నాడు. ఈ క్రమంలో టీబీ ఆసుపత్రి వద్దకు వచ్చే సరికి జాతీయ రహదారి మరమ్మతులు చేస్తున్నందున సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది.

గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా రేషన్ పంపిణీ


రేషన్ పంపిణీ కిట్లను చూపుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

బొల్లాపల్లి : గర్భిణులు, బాలింతలకు ఇంటికే రేషన్ ఇవ్వనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి తెలిపారు. కొంతమంది గర్భిణులు, బాలింతలు మధ్యాహ్న భోజనానికి అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం ఇబ్బందుల వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్టు 2వ తేదీన లాంఛనంగా ఇంటికే రేషన్ పథకం ప్రారంభిస్తారని, అప్పటి నుంచి వీరికి ప్రతినెలా రేషన్ అందజేస్తామన్నారు. 3 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర కిలో ఆయిల్, 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, వీటితో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును అందజేస్తామన్నారు. ఈ కిట్టులో రాగి పిండి 2 కేజీలు, అటుకులు కేజీ, పావు కేజీ బెల్లం, పావు కేజీ చిక్కీలు, పావు కేజీ ఖర్జూరాలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టులో ఉంటాయని తెలిపారు. ఆగస్టు నెల నుంచి గర్భిణులు, బాలింతలు ప్రతిఒక్కరికీ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి రేషన్ పంపిణీ ఉంటుందని సూపర్‌వైజర్ తెలిపారు.

చెరువు శుభ్రం



శావల్యాపురం మంచినీటి చెరువులో నీటిని పూర్తిగా మోటార్ల ద్వారా బయటకు పంపినట్లు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ శనివారం తెలిపారు. గ్రామస్తులు సహకారంతో పంచాయతీ నిధులతో రెండు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి చిన్నపాటి మరమ్మతులు చేపట్టి, చెరువులో బ్లీచింగ్‌తో శుద్ధి చేసిన తదుపరి సాగర్ జలాలను చెరువులోకి నింపుతామన్నారు.

–శావల్యాపురం

జిల్లా కేంద్రానికి సమృద్ధిగా తాగునీరు

- సుమారు రూ.5 కోట్లతో పనులు
- ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- రావిపాడు శాంతినగర్‌లో ఫిల్టర్ పాయింట్


ఫిల్టర్ పాయింట్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి (ఫైల్)

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణ ప్రజల అవసరాలకు తగ్గట్లుగా తాగునీరు అందించేందుకు ఒక ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా కృషిచేస్తున్నారు. నరసరావుపేట జిల్లా కేంద్రంగా మారి ఏడాది గడిచి పోయింది. క్రమంగా జనాభా సంఖ్య పెరుగుతోంది. బిల్డర్లు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విపరీతంగా అపార్టుమెంట్లు నిర్మాణం చేపట్టారు. పట్టణానికి చుట్టుప్రక్కల ఉన్న ఐదు పంచాయతీల్లోని పట్టణ శివారు ప్రాంతాన్ని పురపాలక పరిధిలోకి తీసుకొచ్చి వార్డుల సంఖ్యను 34 నుంచి 38కు పెంచారు. దీంతో అనేక ప్రాంతాలు పట్టణ పరిధిలోకి వచ్చాయి. అయితే కోర్టు కేసుల కారణంగా ఈ మార్పులను అధికారికంగా ప్రభుత్వం ప్రకటించటం జరగలేదు. అయినప్పటికీ చేసిన మార్పులకు అనుగుణంగా భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఎమ్మెల్యే సూచనలపై అధికారు లు పనులు చేపట్టారు. రాబోయే జనాభాను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.5 కోట్ల మున్సిపల్ సాధారణ నిధులు, అమృత్ పథకం నిధులతో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఆరు లక్షల లీటర్ల ట్యాంకు

పట్టణంలో 35 వేలకు పైగా ఉన్న గృహాలు, 200లకు పైగా ఉన్న అపార్టుమెంట్లలో నివాసం ఉంటున్న 1.30 లక్షల మంది నివాసితుల తాగునీటి అవసరాలను తీర్చనున్నాయి. ఇప్పటికే పట్టణానికి నాలుగువైపులా ఉన్న 10 ఓవర్‌హెడ్ ట్యాంకులకు తోడుగా సుమారు రూ.1.15 కోట్ల వ్యయంతో మార్కెట్ యార్డులోని స్థలంలో ఆరు లక్షల లీటర్ల సామర్థ్యంగల నూతన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు.

10 కిలోమీటర్ల మేర పైపు లైను

అమృత్ నిధులతో చేపట్టిన ఈ వాటర్ ట్యాంకు ఈ ఏడాది చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి రానుంది. దీనివల్ల ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది వార్డుల్లోని ఇస్లాంపేట, శ్రీనివాస నగర్, సాంబశివరావు పేట, కోటప్పకొండరోడ్డు తదితర ప్రాంతాల్లోని ప్రజలకు, ఆయా ప్రాంతాల శివారు ప్రాంతాలకు తాగునీటి అవసరాలు పూర్తిగా తీరనున్నాయి. అలాగే పలు వార్డుల్లో అమృత్ పథకం కింద సుమారు 10 కిలోమీటర్ల పొడవున తాగునీటి పైపు లైనులు వేశారు.

శాంతినగర్‌లో ఫిల్టర్ పాయింట్

దీంతో పాటు పట్టణ ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించేందుకు రావిపాడు సమీపంలోని శాంతినగర్‌లోని మున్సిపల్ నీటిశుద్ధి కేంద్ర ఆధునికీకరణ చేపట్టారు. సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో శాంతినగర్ ఫిల్టర్ పాయింట్‌ను పూర్తిగా ఆధునీకరిస్తున్నారు. నాలుగు నెలలుగా జరుగుతున్న ఈ పనులు పూర్తికావొచ్చాయి.

భవిష్యత్ అవసరాల మేరకు..



జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఏర్పడటం ద్వారా జనాభా పెరిగే అవకాశం ఉంది. వచ్చే పదేళ్లలో మరింతగా పెరుగుతుంది. పట్టణ విస్తరణ జరిగింది. వీరందరికి తాగునీటిని రోజుకు రెండుపూటలా అందజేయటం కోసం పనులు చేపట్టాం. ఈ ఏడాది చివరినాటికి పనులన్నీ పూర్తికావొచ్చాయి. శాంతినగర్ నీటిశుద్ధి పాయింట్‌ను వచ్చే నెలలో ప్రారంభిస్తాం.

–ఎం.రామ్మోహన్, కమిషనర్


మార్కెట్ యార్డులో నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

బ్యాంక్ ఆఫ్ ఇండియా
వినుకొండ బ్రాంచ్, లాయర్స్ స్ట్రీట్, కొత్తపేట, వినుకొండ.
ఫోన్ : 08646-272444

బంగారు నగల వేలము ప్రకటన

క్రమ సంఖ్య	ఖాతా నెంబరు	దారాదారుని పేరు, చిరునామా	బంగారం గ్రాములలో
1	567777610012811	మున్నెపల్లి శ్రీనివాసరావు, S/o.కోటేశ్వరరావు శివపురం గ్రామం, వినుకొండ మండలం	42.5
2	567777610019245	కమతం నాగిరెడ్డి, S/o. వెంకటేశ్వరరెడ్డి శివపురం గ్రామం, వినుకొండ మండలం	45.8
3	567777610013780	కమతం నాగిరెడ్డి, S/o. వెంకటేశ్వరరెడ్డి శివపురం గ్రామం, వినుకొండ మండలం	62.1

తేది: 29.07.2023 సం/- బ్రాంచి మేనేజర్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com